ఓటమి భయంతోనే రుణమాఫీ డైలాగ్

- ఎన్నికల తర్వాత బీజేపీలోకి రేవంత్
- రాష్ట్రంలో ఎగిరేది గులాబీ జెండానే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదిలాబాద్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో రైతులు కర్రుకాల్చి వాతపెడతారన్న భయంతోనే కొత్త డైలాగ్‌లు చెప్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆగస్టు 15 అంటూ కొత్త డైలాగ్‌లు చెప్తున్నారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను విస్మరించి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో పెను రాజకీయ మార్పులొస్తాయని, రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని, నంబర్ వన్ జంపింగ్ స్టార్ రేవంత్ అవుతారని చెప్పారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కోసం కాకుండా ప్రధాని మోదీ కోసం పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు దమ్ముంటే మీ ముఖ్యమంత్రి కాంగ్రెస్ నాయకుడా? బీజేపీ నాయకుడా? చెప్పాలని సవాల్ విసిరారు. మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకీ వేసినట్టే నని పేర్కొన్నారు. తమకు మూడింట రెండొంతుల మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను మాయం చేసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. మేక్ ఇన్ ఇండియా, క్వింట్ ఇండియా, స్టార్టప్ ఇండియా కార్యక్రమాలు ఏమయ్యాయో కానీ, 'బేచో ఇండియా' కార్యక్రమాన్ని బీజేపీ అమలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మేస్తే ఇక రిజర్వేషన్లు ఉండవని, ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు.

> పార్లమెంట్ ఎన్నికలు పార్టీ నాయకుల, కార్యకర్తల భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. ఆగస్టులో పంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత జడ్పీటీసీ, సొసైటీ ఎన్నికలు వస్తాయి. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా పట్టుపడితే విజయం సాధిస్తాం. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజలు కోపంగా ఉన్నారు.
> - కేటీఆర్

పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక బీఆర్ఎస్

మతం పేరిట మంటలు పెడుతున్న బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలని కేటీఆర్ కోరారు. రాముడితో తమకు పంచాయితీ లేదని, 'రాముడికి మొక్కుదాం. తెలంగాణకు పైసా ఇవ్వని బీజేపీని తొక్కుదాం' అనే నినాదంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని, దక్షిణాదిలో తగ్గించేందుకు బీజేపీ ఆలోచిస్తున్నదని, తెలంగాణలో సీట్లు తగ్గితే పార్లమెంట్‌లో మన గొంతుక వినిపించేవారే ఉండరని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు.

అత్రం సక్కు లాంటి సీనియర్ నాయకులు పార్లమెంట్‌లో ఉంటే పార్టీకి, రాష్ట్రానికి, ఆదిలాబాద్‌కు లాభ జరుగుతుందని కేసీఆర్ భావించి, టికెట్ ఇచ్చారని వివరించారు. అధికారంలో లేకపోతే కొంతమంది నాయకులు పార్టీని వదిలిపోతున్నారని, ఆదివాసీ నేత ఆత్రం సక్కు మాత్రం కార్యకర్తలపై నమ్మకం ఉంచి పోటీ చేస్తున్నారని చెప్పారు.

మే 13న రైతులు బుద్ధి చెప్పాలి

'రైతుబంధు అడిగితే చెప్పుతీసి కొడుతా' నని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారని, అలాంటి నేతలకు మే 13న రైతులే చెప్పులు తీసి బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో 70 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.70 వేల కోట్లు జమ చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, కరెంటు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్ల డబ్బుల పంపిణీ సక్రమంగా కొనసాగిందని, కాంగ్రెస్ పార్టీ మాత్రం కరువును తీసుకొచ్చిందని తెలిపారు.

యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే అందరికంటే ఎక్కువగా 1,60,283 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని కేటీఆర్ వివరించారు. ఇటీవల రేవంత్‌రెడ్డి ఇచ్చిన 32 వేల ఉద్యోగాలు కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించినవేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజు రూ.400 పెడితే, తాము ఉచితంగా ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు రూ.2 వేలు వసూలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వం 5 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే నాడు పాతికవేల ఖాళీలు ఉన్నాయని విమర్శించిన కాంగ్రెస్ ఇప్పుడు పది వేల ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు.

> కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలిగిపోయాయి. ప్రజలు మే 13 ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టాలని చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే. కొందరు నాయకులు పదవులు, పైరవీల కోసం పార్టీని వదిలి పోతున్నా కార్యకర్తల్లో పోరాట పటిమ ఏమాత్రం తగ్గలేదు.
> - కేటీఆర్

కేసీఆర్ గిరిజన బంధువు

బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిందని, పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయడంతోపాటు సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని కేటీఆర్ గుర్తుచేశారు. గిరిజన వీరుడు కుమ్రంభీం నినాదం 'జల్, జంగిల్, జమిన్'ను కేసీఆర్ ఆచరణలో చేసి చూపెట్టారని వివరించారు. కాంగ్రెస్ పాలనలో గిరిజనులపై కాల్పులు జరిగాయని, రేవంత్‌రెడ్డి, మంత్రులు సిగ్గు లేకుండా ఇంద్రవెల్లి పర్యటనలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పకుండా, గిరిజనులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

ఆదర్శపాలకుడు శ్రీరామచంద్రుడు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ● ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): శ్రీరామ నవమి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ఆదర్శ పరిపాలకుడని, అన్యోన్య దాంపత్యానికి పుణ్యదంపతులైన సీతారాములు ఆదర్శనీయులని తెలిపారు. ఆ సీతారాముల కరుణకటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఉండాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందేలా, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని భద్రాద్రి సీతారామచంద్రులను కేసీఆర్ ప్రార్థించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసం సమీపంలోని ఖాళీ స్థలంలో పెట్టిన సామగ్రి

కేసీఆర్ నివాసం సమీపంలో క్షుద్రపూజల కలకలం!

బంజారాహిల్స్, ఏప్రిల్ 16 : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నం 14లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసం సమీపంలో క్షుద్రపూజలు అంటూ ఓ వార్త కలకలం సృష్టించింది. కేసీఆర్ ఇంటికి సమీపంలోని ఖాళీ ప్లాట్‌లో మంగళవారం మధ్యాహ్నం ముగ్గు మధ్యలో ఒక బొమ్మకు పసుపు కుంకుమ చల్లి ఎర్రటి వస్త్రంలో నిమ్మకాయలు, మిరపకాయలు ఇతర సామగ్రిని గుర్తించి స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం నందినగర్ బస్తీలో వ్యాపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి కొంతమంది యువకులు ఖాళీ స్థలంలో కనిపించారని స్థానికులు తెలిపారు. ఇది ఎవరైనా అకతాయిల పని కావొచ్చని మరికొందరు చెప్పారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తూ విచారణ చేస్తున్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్సీలను ఏం చేద్దాం?

- అధికారులతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చర్చ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీఆర్ఎస్ తరపున నామినేట్ అయిన, ఆ పార్టీ తరపున గెలిచి వేరే పార్టీలోకి మారిన ఎమ్మెల్సీల విషయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ మారారని, వీరిద్దరి శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఫిర్యాదు చేసింది. దీనిపై చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చట్టపరమైన అంశాలను, గతంలో అనుసరించిన సంప్రదాయాల గురించి శాసనసభ కార్యదర్శితో చర్చించారు. న్యాయనిపుణులతో కూడా మాట్లాడారు. అన్ని అంశాలను పరిశీలించిన తరువాతనే పార్టీ మారిన ఎమ్మెల్సీలపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సభ్యత్వాలను రద్దు చేయాలని బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న విషయం తెల్సిందే. వారిపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం జరుగుతుండటంతో బీఆర్ఎస్ పార్టీ హైకోర్టును కూడా ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో శాసనమండలి చైర్మన్ ఎమ్మెల్సీల అనర్హత అంశంపై మంగళవారం సమీక్షించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.

ఉద్యమకారుడు రవీందర్‌కు కన్నీటి వీడ్కోలు

- అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ
- మాజీ ఎమ్మెల్యే గండ్ర నివాళులు

శాయంపేట, ఏప్రిల్ 16 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ (44) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. గ్రామంలో మొదట టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఉండటంతోపాటు కేసీఆర్ పిలుపుతో ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన మరణాన్ని తెలంగాణ ఉద్యమకారులు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.రవీందర్ మృతితో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కలత చెందారు. మంగళవారం హుటాహుటిన కొప్పుల గ్రామానికి వెళ్లి రవీందర్ భౌతికకాయంపై పూలమాల ఉంచి, బీఆర్ఎస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ తాను కన్నీరు పెట్టుకున్నారు. అంతిమయాత్రలో రవీందర్ శవపేటికను మోశారు. 23 ఏండ్లుగా ఉద్యమ పార్టీని వీడకుండా నిఖార్సైన ఉద్యమకారుడిగా రవీందర్ నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఇలాంటి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి.. రవీందర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమకారులు, గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



అంతిమయాత్రలో రవీందర్ శవపేటికను మోస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి. (ఇన్‌సెట్‌లో) జలుగూరి రవీందర్ (ఫైల్)

బిడ్డా కడియం.. కాస్కో

- ఇక నుంచి మన మధ్య కబడ్డీ.. కబడ్డే!
- విదేశాల్లో శ్రీహరికి అక్రమ ఆస్తులు
- వాటికి కావ్య దంపతులే బినామీలు
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్

మడికొండ, ఏప్రిల్ 16: 'బిడ్డా కడియం కాస్కో.. ఇక నుంచి మన ఇద్దరి మధ్య కబడ్డీ.. కబడ్డే. స్టేషన్‌ఘన్‌పూర్‌లో నువ్వు చేసిన అభివృద్ధి, నేను చేసిన అభివృద్ధిపై బహిరంగచర్చకు సిద్ధమా?' అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తాటికొండ రాజయ్య తొడకొట్టి సవాల్ విసిరారు. మంగళవారం హనుమకొండ జిల్లా మడికొండలో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. విదేశాల్లో కడియం శ్రీహరి అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నారని, వాటికి కడియం కావ్య, ఆమె భర్త నజీర్ బినామీలని ఆరోపించారు. మంత్రిగా ఉన్నప్పుడు డీఈవో బదిలీల్లో రూ.2 కోట్లు, లింగంపల్లి ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ వద్ద రూ.6 కోట్లు లంచం తీసుకున్నారని విమర్శించారు. 'నేను మాదిగ బిడ్డను. రానున్న ఎన్నికల్లో డప్పు కొట్టి నీ బండారాన్ని బయటపెడుతా. నిన్ను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలిచి పాతాళానికి తొక్కేస్తా' అంటూ తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దుర్మార్గులకు, మంచికి మధ్య జరుగుతున్న పోరాటంలో మంచి తప్పకుండా గెలుస్తుందని చెప్పారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కడియంకు దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో పోటీలో నిలిచానని, ప్రజలు ఆశీర్వదించి పార్లమెంటుకు పంపిస్తే నిజాయితీతో పనిచేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, నాయకులు రాకేశ్‌రెడ్డి, కార్పొరేటర్ రాధికరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్లమెంట్ సమన్వయకర్తల నియామకం

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందు కు సాగేందుకు బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్తలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. వరంగల్, మెదక్, కరీంనగర్, జహీరాబాద్, పెద్దపల్లి, భువనగిరి, నల్గొండ, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్.. మొత్తం 10 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 70 అసెంబ్లీ ని యోజకవర్గాలకు సమన్వయకర్తలను కేటీఆర్ నియమించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సమన్వయకర్తలు ముందుకు సాగాలని ఆయ న దిశానిర్దేశం చేశారు. సమన్వయకర్తలుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలను నియమించారు.

రుణమాఫీపై సీఎం ప్రకటన ఎన్నికల స్టంటే

- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ విమర్శ

రాజన్నసిరిసిల్ల జిల్లా అనుపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రైతులకు గత డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే విస్మరించిందని, మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోడ్ నెపంతో ఆగస్టు 15న చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన కేవలం ఎన్నికల స్టంటేనని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ భక్తులతో మాట్లాడి కరీంనగర్ తిరుగు ప్రయాణంలో ఇదే మండలంలోని అనుపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరికోతలు మొదలైనా అనేక చోట్ల ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని చెప్పారు. సెంటర్లకు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితిలో క్వింటాకు రూ.1800 చొప్పున తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఫైర్ అయ్యారు. సెంటర్ల నుంచి ధాన్యం తరలించేందుకు మిల్లులకు అలాట్‌మెంట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కొనుగోళ్లు ఆలస్యం చేస్తే విధిలేని పరిస్థితిలో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్టపోతారని, వెంటనే కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాసంగి సీజన్ నుంచే బోనస్ ఇస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు మాట మారుస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వినోద్‌కుమార్‌తో సమస్యలు ఏకరువుపెట్టారు. వరికోతలు కాగానే ధాన్యాన్ని సెంటర్లకు తెచ్చి ఆరబోసి పదిహేను రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదంటూ అన్నదాతలు మొరపెట్టుకున్నారు. అకాల వర్షాలు పడితే ఎండిన వడ్లు మళ్లీ తడిసి ముద్దవుతాయన్న భయంతో తిండితిప్పలు లేక పొద్దంతా కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినోద్‌కుమార్ వెంట జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఉమ్మడి జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ మ్యాకల రవి, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ పేరిట కోటి టోకరా

కరీంనగర్ రాంనగర్, ఏప్రిల్ 16: లాటరీ పేరిట వసూలు చేసిన దాదాపు రూ. కోటితో ముగ్గురు నిర్వాహకులు ఉడాయించిన ఘటన కరీంనగర్‌లో మంగళవారం వెలుగుచూసింది. కరీంనగర్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వాహకులు ఈ దందా నడపడం గమనార్హం. కరీంనగర్‌కు చెందిన సైఫొద్దీన్, ఫారూఖ్, ఎండీ అహ్మద్ కలిసి రెండేండ్లుగా 'ఎస్‌కే ఫ్రెండ్స్ అండ్ కో' పేరిట కశ్మీరుగడ్డలో లక్కీలాటరీని నిర్వహిస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, వేములవాడ, సుల్తానాబాద్, మంచిర్యాల ప్రాంతాల నుంచి 13 మంది వరకు ఏజెంట్లను నియమించుకున్నారు. దాదాపు 560 మంది సభ్యుల నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున సుమారు రూ.89 లక్షల 60 వేల దాకా వసూలు చేశారు. లాటరీ ద్వారా ప్రతినెలా కరీంనగర్‌లోని ఓ గెస్ట్ హౌస్‌లో డ్రా తీసి గెలిచిన 12 మంది కస్టమర్లకు 12 బహుమతులు ఇచ్చేవారు. ఇలా 14 నెలల వరకు డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. 15వ నెల డ్రా తీసినా.. గెలిచిన వారికి బహుమతులు ఇవ్వలేదు.కొత్తగా డ్రా తీయడం లేదు. అప్పటి నుంచి ఏజెంట్లు, సభ్యులు నిర్వాహకులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. ఈ వ్యవహారంలో నిర్వాహకులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని మంగళవారం టూ టౌన్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు.

ప్రాణం తీసిన సర్కారు గురుకులం

- 'భువనగిరి ఫుడ్‌పాయిజన్'తో విద్యార్థికి తీవ్ర అస్వస్థత
- ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై ప్రశాంత్‌కు చికిత్స
- మృత్యువుతో పోరాడి ప్రాణాలు వదిలిన బాలుడు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు
- హాస్టల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసిన అధికారులు
- చికిత్స పొందుతున్న మరో ఐదుగురు విద్యార్థులు
- గుట్టుచప్పుడు కాకుండా విద్యార్థులకు వైద్యం

చిన్నలచ్చి ప్రశాంత్ (ఫైల్)

భువనగిరి అర్బన్/భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 16: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్‌కు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి చెందాడు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో దవాఖానలో ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి మంగళవారం ప్రాణాలు విడిచాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. భువనగిరి పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సీహెచ్ ప్రశాంత్ (12) ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11న రాత్రి హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ కావడంతో ఇప్పటివరకు 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మొదటగా 10 మందిని మెరుగైన చికిత్స కోసం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించి ఆరుగురికి అక్కడే చికిత్స కొనసాగించారు. పరిస్థితి విషమించిన నలుగురు విద్యార్థుల్లో ఇద్దరిని ఉస్మానియా దవాఖానకు, మరో ఇద్దరిని హైదరాబాద్‌లోని మిరాకిల్ దవాఖానకు తరలించారు. మిరాకిల్ దవాఖానలో చికిత్స పొందుతున్న సీహెచ్ ప్రశాంత్ పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో గత శనివారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో దవాఖానకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నాడు. ప్రశాంత్ ఆరోగ్యం మరింత క్షీణించి మంగళవారం సాయంత్రం మృత్యువాతపడ్డాడని మృతుని మేనమామ సురేశ్ తెలిపారు. ప్రస్తుతం మృతదేహం హైదరాబాద్‌లోని రెయిన్‌బో దవాఖానలోనే ఉన్నట్టు ప్రశాంత్ కుటుంబ సభ్యులు చెప్పారు. పాఠశాలలో ఇప్పటివరకు మొత్తం 28 మంది అస్వస్థతకు గురికాగా.. భువనగిరి ఏరియా దవాఖానలో ఇంకా ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. 22 మంది డిశ్చార్జ్ అయ్యారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన రోజు నుంచి గుట్టుచప్పుడు కాకుండా అధికారులు చికిత్స చేయించే ప్రయత్నం చేశారని ఆరోపణలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లికి చెందిన చిన్నలచ్చి మహేశ్, పారిజాత దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

మహేశ్ బోర్ బండి డ్రైవర్‌గా, పారిజాత కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పెద్ద కుమారుడు ప్రశాంత్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. విద్యాభ్యాసం కోసం గురుకులానికి వచ్చి కలుషితమైన ఆహారం తిని విద్యార్థి నిండు ప్రాణాలు బలైన ఘటన జిల్లాలో కలకలం రేపింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ కొడుకు ప్రశాంత్‌కు మెరుగైన వైద్యసేవలు అందించేలా హాస్టల్ నిర్వాహకులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల కోడ్ పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారని వాపోయారు. ప్రశాంత్ కుటు